# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- తల్లి వందనం పథకాన్ని మే నెలలో అమలు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.
- విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకునేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.
- రాష్ట్రంలో ఇటివల జరిగిన పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయని.. ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి నారాలోకేష్ చెప్పారు.
- శివరాత్రి సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ఈ రోజు నుండి మూడు రోజుల పాటు తిరుపతి జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతోంది.
- అన్నమయ్య జిల్లాలో గుండాలకోన వద్ద ఏనుగుల దాడిలో మృతి చెందిన భక్తులకు ప్రభుత్వం పరిహారం ప్రకటించింది.

==============================

రాష్ట్ర పునర్నిర్మానానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనసభలో చేపట్టిన చర్చలో భాగంగా ఈరోజు ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. మే నెలలో “తల్లికి వందనం” పథకాన్ని అమలు చేస్తామని, ఎంత మంది పిల్లలున్నా అందరికీ దీనిని వర్తింపచేస్తామని స్పష్టం చేశారు. త్వరలో రైతు భరోసా పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 20 వేల రూపాయలు అందిస్తామని తెలియజేశారు. మత్స్యకారులకు ఇచ్చిన హామీ మేరకు 20 వేల రూపాయలు ఇస్తామని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 37 సెకన్లు)

================================

అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం గుండాలకోన వద్ద ఈ రోజు తెల్లవారు జామున ఏనుగులు భక్తులపై దాడి చేశాయి. ఈ ఘటనలో ముగ్గురు భక్తులు మృతి చెందాగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. శివరాత్రిని పురస్కరించుకుని వై.కోటకు చెందిన భక్తులు ఆలయానికి నడుచుకుని వెళ్తుండగా వారిపై ఏనుగులు గుంపు దాడి చేసింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి  నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి  కె. పవన్ కల్యాణ్ స్పందిస్తూ... ముగ్గురు చనిపోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు 10 లక్షల రూపాయలు, తీవ్రంగా గాయపడిన వారికి 5 లక్షల రూపాయలు పరిహారం ప్రకటించారు. సమగ్ర నివేదిక అందజేయాలని అటవీశాఖ అధికారులను ఉపముఖ్యమంత్రి ఆదేశించారు.

================================

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఎటువంటి  అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వెయ్యి మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని పోలీస్ సూపరింటెండెంట్ వి. హర్షవర్ధన రాజు తెలిపారు. శ్రీకాళహస్తిలోని నాలుగుమాఢ వీధుల్లో శివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను ఆయన ఈరోజు  పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ పాత్రికేయులతో మాట్లాడుతూ... శివరాత్రి సందర్భంగా రేపటి నుండి వరసగా మూడు రోజుల పాటు  భక్తులు భారీ సంఖ్యలో రానున్నారని రద్దీకి అనుగుణంగా ముందస్తు బందోబస్తు ఏర్పాట్లను ప్రణాళికా బద్ధంగా చేస్తున్నామని వెల్లడించారు.

================================

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకునేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్  పేర్కొన్నారు. అసెంబ్లీలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే చర్చలో ఈ రోజు ఉపముఖ్యమంత్రి మాట్లాడారు. 4 వేల 500 కోట్ల రూపాయల వ్యయంతో 30 వేల అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించామని తెలిపారు. 6 నెలల్లో 4,300 కిలో మీటర్ల  రహదారుల నిర్మాణం పూర్తి చేశామని ఆయన వెల్లడించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047కు అనుగుణంగా పని చేస్తున్నామని పవన్ కళ్యాణ్ పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

================================

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఈ రోజు నుండి మూడు రోజుల పాటు తిరుపతి జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడపనుంది.  భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని, ఈ రోజు 87 బస్సులను, రేపు 209, గురువారం 140 అదనపు బస్సులు నడపనుంది. ఇందులో తిరుపతి, కోడూరు-తలకోన, గుడిమల్లం, శ్రీకాళహస్తి-తిరుపతి, నాయుడుపేట, గూడూరు, పిచ్చాటూరు, తడ, చెన్నైలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు.

విరామం

================================

ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో ఈరోజు గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ చేపట్టారు. అందులో భాగంగా ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ ఉద్యోగ అవకాశాలపై అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిస్తూ.. రాష్ట్రంలో పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని.. కొత్త ప్రాజెక్టుల వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. పెట్టుబడులు పెట్టగానే ఉద్యోగాలు వస్తాయని తాము చెప్పట్లేదని.. పరిశ్రమలు ఏర్పాటయిని రెండు, మూడు సంవత్సరాల్లో ఉద్యోగ అవకాశాలు వస్తాయని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

================================

ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వేతో భూ సమస్యలు తొలగి రైతులకు, భూ యజమానులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈరోజు కొమరాడ మండలం శివరాంపురం గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి రీ సర్వే జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. గ్రామంలో ప్రైవేటు భూములతో పాటు గ్రామ సరిహద్దులు, నీటి వనరుల భూములు, ఇతర భూములను కొలతలు వేసి ఖచ్చితమైన సరిహద్దులను ఏర్పాటు చేయాలని, రహదారులు, రైల్వేలకు కేటాయించిన భూములలో హద్దులు నిర్ణయించి రక్షణ కల్పించాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వేలో తప్పులు దొర్లకుండా పక్కాగా నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

================================

రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తోంది. ఈ నేపధ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి  పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పలువురు రైతులు ఆకాశవాణి ద్వారా ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో 88 వేల మంది రైతుల ఖాతాల్లో 17 కోట్ల 51 లక్షల రూపాయలు 19వ విడత నిధులు జమ చేయడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పెట్టుబడి సాయం తమకెంతో ఉపయోగపడుతున్నదని కె. రాయులు అనే లబ్ధిదారుడు ఆకాశవాణితో మాట్లాడుతూ...

(వాయిస్ 20 సెకన్లు)

================================

గిరిజనుల హక్కులు, చట్టాల పై గిరిజన ప్రజలు అవగాహన పెంచుకోవాలని  చిత్తూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఎం.ఎస్. భారతి పేర్కొన్నారు. ఈ రోజు చిత్తూరు రూరల్ మండలం, మాసపల్లి గ్రామంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ  ఆధ్వర్యంలో  గిరిజనుల హక్కులు, చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కోర్టు కేసులు ఉన్న గిరిజనులు,  జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా సత్వర న్యాయం పొందవచ్చునని ఆమె వివరించారు.

================================

పరీక్షల పట్ల భయం వీడి, ఆత్మస్థైర్యంతో సిద్ధం కావాలని సాగాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యార్థులకు పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని జిల్లా పరిషత్ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులతో దృశ్య శ్రవణ మాధ్యమ విధానంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులలో స్ఫూర్తిని నింపారు. ఆందోళన లేకుండా ప్రణాళికా బద్ధంగా చదువుతూ.... ఉపధ్యాయులు అందించిన సూచనలు పాటిస్తూ.. అత్యుత్తమ మార్కులు సాధించాలని సూచించారు.

================================

మహాశివరాత్రి పర్వదినాన్ని  పురస్కరించుకుని  ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలోని బలివే గ్రామంలో 12వ శతాబ్దం నాటి  శ్రీ బలే రామలింగ స్వామి ఆలయంలో వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవాదాయశాఖ అధికారి సీతారామాంజనేయులు తెలిపారు. మూడు రోజులు సుమారు 3 లక్షల మంది భక్తులు ఉత్సవాలకు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశామని, అలాగే భక్తుల కొరకు 25 వేల లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేశామని  తెలిపారు.

================================

ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవిఎం యంత్రాలు, వివిప్యాట్ లు భద్రపరిచిన గోదామును కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఈ రోజు తనిఖీ చేశారు. ఈవిఎం గోడౌన్ కు వేసిన భద్రతా సీళ్లు, సిసి కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, సెక్యూరిటీ లాగ్ బుక్ ను ఆమె పరిశీలించారు.

================================

================================